సాక్షి నాగర్‌కర్నూల్

శనివారం : 24 : ఫిబ్రవరి : 2024



స్నాతకోత్సవానికి వేళాయె

పాలమూరు యూనివర్సిటీ 4వ స్నాతకోత్సవానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

వివరాలు 8లో ▸



జములమ్మ దీవించమ్మా

నడిగడ్డవాసుల ఇలవేల్పు జములమ్మ బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి.

వివరాలు 8లో ▸

గరిష్టం/కనిష్టం **37.7 /18.6**

వాతావరణం

రోజంతా ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ వేడిమి.. ఉదయం, రాత్రి వేళల్లో చలి తీవ్రత ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

దేవదేవుడికి హనుమ వాహనసేవ



మహబూబ్‌నగర్ రూరల్: మన్యంకొండ శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామికి శుక్రవారం హనుమ వాహనసేవ అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శోభాయమానంగా అలంకరించిన హనుమ వాహనంపై స్వామివారిని గర్భగుడి నుంచి దేవస్థానం ముందున్న మండపం వరకు ఊరేగించి.. అనంతరం తిరిగి గర్భగుడిలోకి తీసుకెళ్లి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణం భక్తుల హరినామస్మరణ మధ్య స్వామివారి సేవ ముందుకు కదిలింది. ఆలయ చైర్మన్ అళహరి మధుసూదన్‌కుమార్, ఈఓ శ్రీనివాసరాజు, సూపరింటెండెంట్ నిత్యానందాచారి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

గడువు పొడిగింపు

కోడేరు: స్థానిక మోడల్ స్కూల్‌లో ప్రవేశానికి వచ్చేనెల 2 వరకు ప్రభుత్వం గడువు పొడిగించిందని పాఠశాల ప్రిన్సిపాల్ ఉమా అత్ర శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 6, 7, 8, 9, 10 తరగతుల్లో ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని 6వ తరగతిలో 100, 7 నుంచి 10వ తరగతి వరకు మిగిలిన సీట్లు ఉన్నాయన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు జనరల్ రూ.200, ఎస్సీ, ఎస్టీ, బీసీలు రూ.125 చెల్లించాలన్నారు. ఏప్రిల్ 7న 10 గంటలకు 6వ తరగతి పరీక్ష, మధ్యాహ్నం 2 గంటల నుంచి 7 నుంచి 10వ తరగతి ప్రవేశ పరీక్ష ఉంటాయన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

యువత ఓటుహక్కు వినియోగించుకోవాలి

కందనూలు: జిల్లాలో అర్హులైన ప్రతిఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకొని, ఓటుహక్కు వినియోగంపై అవగాహన పెంచుకోవాలని డీఆర్‌డీఓ, పార్లమెంట్ ఎన్నికల స్వీప్ జిల్లా నోడల్ అధికారి చిన్నఓబులేసు అన్నారు. శుక్రవారం జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాల విద్యార్థులతో క్రమబద్ధమైన ఓటర్ల విద్య, ఎన్నికల భాగస్వామ్యం అంశంపై పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా స్వీప్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత్ ప్రజాస్వామ్య దేశం, ప్రజలే ప్రభుత్వాలను ఏర్పాటు చేసే విధానంలో ఓటు హక్కు విలువైనది అన్నారు. ఓటుతో దేశ భవిష్యత్‌ను మార్చుకోవాలని చెప్పారు. ఓటుహక్కు ప్రజలందరికీ సమానంగా ఉంటుందన్నారు. 18 ఏళ్ల వయస్సు నిండిన ప్రతిఒక్కరూ తప్పనిసరిగా ఓటు నమోదు చేసుకోవాలని సూచించారు. అనంతరం జిల్లా సైన్స్ అధికారి కృష్ణారెడ్డి ఓటరు ప్రతిజ్ఞ చేయించి, ఓటు విశిష్టత నూతన ఓటు నమోదుపై అవగాహన కల్పించారు. కళాశాల ప్రిన్సిపల్ కమర్ షాజహాన్ సుల్తానా, అదనపు డీఆర్‌డీఓ లక్ష్మీనారాయణ, జిల్లా సైన్స్ అధికారి కృష్ణారెడ్డి, లెక్చరర్ మల్లికార్జున్, ఏపీడీ శ్రీనివాస్ పాల్గొన్నారు.



హైవేలపై ఆశలు..

మహబూబ్‌నగర్– శ్రీశైలం, పెబ్బేరు– జడ్చర్ల మధ్య పెరిగిన రాకపోకలు



మహబూబ్‌నగర్– అచ్చంపేట ప్రధాన రహదారి

- వాహనాల రద్దీకి అనుగుణంగా లేని రోడ్డు సౌకర్యం
- 14 రహదారులకు జాతీయ హోదా కల్పించాలని కేంద్ర మంత్రిని కోరిన సీఎం
- ఉమ్మడి పాలమూరు జిల్లాలో ఐదు రోడ్లకు మహర్దశ
- రెండు తెలుగు రాష్ట్రాలకు అన్నివిధాలా మేలు

అచ్చంపేట: ఉమ్మడి జిల్లాలో ప్రధాన రహదారులైన మహబూబ్‌నగర్– నాగర్‌కర్నూల్– అచ్చంపేట, పెబ్బేరు– వనపర్తి– బిజినేపల్లి– జడ్చర్ల మధ్య ప్రయాణం నరకప్రాయంగా మారింది. పెరిగిన వాహనాల రద్దీకి అనుగుణంగా రోడ్ల విస్తరణ జరగకపోవడంతో ఈ దుస్థితి ఎదురవుతుంది. రాష్ట్రంలోని 14 రహదారులకు జాతీయ హోదా కల్పించాలని సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవల ఢిల్లీలో కేంద్రమంత్రి నితిన్ గడ్కరీని కలిసి కోరడంతో ఉమ్మడి జిల్లాలోని ప్రధాన రోడ్లపై ఆశలు చిగురిస్తున్నాయి. అదేవిధంగా మొదటి ప్రాధాన్యతగా 780 కి.మీ., మేర 6 రహదారులకు జాతీయ హోదా కల్పిస్తూ.. 2024– 25 వార్షిక ప్రణాళికలో నిధులు కేటాయించాలని రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఇటీవల కేంద్రమంత్రి నితిన్ గడ్కరీకి విజ్ఞప్తి చేశారు. కీలకమైన పెబ్బేరు– వనపర్తి– బిజినేపల్లి– జడ్చర్ల రోడ్డును జాతీయ రహదారిగా మార్చాలని 2017లో ప్రతిపాదనలు పంపించారు. సీఎం కోరిన రోడ్లలో ఇది లేకపోవడం ఈ ప్రాంత ప్రజలను నిరాశకు గురిచేస్తోంది.

జాతీయ హోదా కల్పించాలని..

తాజాగా సీఎం రేవంత్‌రెడ్డి అప్‌గ్రేడ్ కోరిన 14 రహదారుల్లో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు సంబంధించి ఐదు రహదారులు ఉన్నాయి. ఈ కొత్త హైవేలతో నాగర్‌కర్నూల్, వనపర్తి, గద్వాల, నారాయణపేట, నల్లగొండ జిల్లాల్లో కొత్త శోభ సంతరించుకోనుంది. జాతీయ రహదారుల ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం అనుమతిస్తే.. ఉమ్మడి జిల్లా మరింత అభివృద్ధి చెందే అవకాశం ఉంది. సీఎం అందజేసిన జాబితాలో మరికల్ (ఎన్‌హెచ్–167), నారాయణపేట– రామసముద్రం (ఎన్‌హెచ్–150) 63 కి.మీ., పుల్లూరు (ఎన్‌హెచ్–44) అలంపూర్ నుంచి పెంట్లవెల్లి, కొల్లాపూర్, లింగాల, అచ్చంపేట మీదుగా డిండి వరకు (ఎన్‌హెచ్–765), దేవరకొండ (ఎన్‌హెచ్–176), మల్లేపల్లి (ఎన్‌హెచ్–167), నల్లగొండ (ఎన్‌హెచ్–565) 225 కి.మీ., వనపర్తి– పెబ్బేరు–మంత్రాలయం (ఎన్‌హెచ్–167) 110 కి.మీ., ఎర్రవల్లి క్రాస్‌రోడ్డు– గద్వాల– రాయచూర్ 67 కి.మీ., భూత్పూర్– నాగర్‌కర్నూల్– అచ్చంపేట– మన్ననూర్– మద్దిమడుగు– గంగలకుంట (తెలంగాణ)– సిరిగిరిపాడు (ఆంధ్రప్రదేశ్) 166 కి.మీ., రోడ్లు ఉన్నాయి.

తగ్గనున్న దూరభారం



మేము కర్నూలు వెళ్లాలంటే అచ్చంపేట, వనపర్తి, పెబ్బేరు మీదుగా 166 కి.మీ., దూరం పోవాలి. లింగాల– కొల్లాపూర్– అలంపూర్ మీదుగా అయితే 98 కి.మీ., దూరం ఉంటుంది. ఈ రహదారి నిర్మాణం జరిగితే మాకు 68 కి.మీ., దూరం తగ్గుతుంది. మా గ్రామాలు కూడా అభివృద్ధి చెందుతాయి. చిన్న చిన్న వ్యాపారాలు మెరుగుపడతాయి. వెనకబడిన ఈ ప్రాంతాల అభివృద్ధికి ఈ రోడ్డు దోహదపడనుంది.

– వెంకటయ్య, బల్మూర్

అభివృద్ధికి దోహదం



మద్దిమడుగు– మాచర్ల మధ్య కృష్ణానదిపై బ్రిడ్జి ఏర్పాటు ఇక్కడి ప్రజల చిరకాల కోరిక. జాతీయ రహదారులతో ఇది నెరవేరుతుందని ఆశిస్తున్నా. ఈ రోడ్ల ఏర్పాటుతో ఉమ్మడి జిల్లా పర్యాటకంగా, పారిశ్రామికంగా మరింత అభివృద్ధి సాధిస్తుంది. పుల్లూరు– అలంపూర్– కొల్లాపూర్– అచ్చంపేట– డిండి– నల్లగొండ రోడ్డు, భూత్పూర్– నాగర్‌కర్నూల్– మన్ననూర్– మద్దిమడుగు రోడ్లు మంజూరైతే నల్లమల ప్రాంతం అభివృద్ధికి దోహదపడుతుంది.

– వంశీకృష్ణ, ఎమ్మెల్యే, అచ్చంపేట

ప్రాజెక్టులను అనుసంధానిస్తూ..

జోగుళాంబ జిల్లాలోని జూరాల, భీమా, నెట్టెంపాడు ప్రాజెక్టులతోపాటు కేఎల్‌ఐ, పాలమూరు– రంగారెడ్డి, ఎస్‌ఎల్‌బీసీ ప్రాజెక్టులను అనుసంధానం చేస్తూ జాతీయ రహదారి నిర్మాణ ప్రతిపాదనలను రూపొందించారు. ఈ రోడ్డు ఏర్పాటైతే వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్, ఇరిగేషన్ ప్రాజెక్టులకు రాకపోకలు సులభతరంగా మారనుంది. ప్రాజెక్టులను అనుసంధానం చేసే రోడ్డుకు జాతీయ హోదా కల్పించే విషయాన్ని ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు సీఎం దృష్టికి తీసుకెళ్లి సాధించాలనే డిమాండ్ ప్రజల నుంచి వస్తోంది.

పుణ్యక్షేత్రాల మీదుగా..

కర్ణాటక, మహారాష్ట్ర, ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాలకు చెందిన వాహనాలు శ్రీశైల క్షేత్రానికి రాకపోకలు సాగించాలంటే మహబూబ్‌నగర్– అచ్చంపేట రోడ్డే ప్రధాన దిక్కు. శ్రీశైలం, మద్దిమడుగు పబ్బతి ఆంజనేయస్వామి, ఉమామహేశ్వరం క్షేత్రం, మల్లెలతీర్థం, లొద్దిమల్లయ్య, సలేశ్వరం పుణ్య క్షేత్రాలతోపాటు పర్యాటకంగా విరాజిల్లుతున్న నల్లమలకు రాష్ట్ర నలుమూలల నుంచే కాక ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు, పర్యాటకులు వస్తుంటారు. ఇలా రాకపోకలు సాగించే వాహనాలకు మహబూబ్‌నగర్– అచ్చంపేట, పెబ్బేరు– వనపర్తి– బిజినేపల్లి– జడ్చర్ల మధ్య ప్రయాణం ఇబ్బందిగా మారింది. ఈ రెండు మార్గాల్లో రోడ్ల సామర్థ్యానికి మించి వాహనాలు నడుస్తున్నాయి. ఫలితంగా వాహనాలు తక్కువ వేగంతో వెళ్లాల్సి వస్తోంది. కొద్ది ప్రయాణానికి ఎక్కువ సమయం కేటాయించాల్సి వస్తోంది. కొత్త రోడ్ల నిర్మాణంతో పరిశ్రమల ఏర్పాటుతోపాటు పర్యాటకంగా, పారిశ్రామికంగా ఉమ్మడి జిల్లా మరింత అభివృద్ధి సాధిస్తుంది. వేలాది మందికి ఉపాధి, ఉద్యోగావకాశాలు లభిస్తాయి.

గెలుపే ధ్యేయంగా ముందుకు..



కల్వకుర్తిలో మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

- రాహుల్‌గాంధీని ప్రధానిగా చేయడమే అంతిమ లక్ష్యం
- రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు

కల్వకుర్తి: అసెంబ్లీ ఎన్నికల్లో ఎలా పనిచేశారో.. అలాగే పార్లమెంట్ ఎన్నికల్లోనూ కార్యకర్తలు కష్టపడి పనిచేయాలని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. శుక్రవారం కల్వకుర్తిలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నాగర్‌కర్నూల్ పార్లమెంట్ పరిధిలోని కల్వకుర్తి నియోజకవర్గ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా మంత్రి జూపల్లి హాజరై మాట్లాడారు. ఎవరిని అభ్యర్థిగా ప్రకటించినా గెలుపే ధ్యేయంగా ముందుకెళ్లాలని, రాహుల్‌గాంధీని ప్రధాని చేయడమే మన అంతిమ లక్ష్యం కావాలని అన్నారు. నాగర్‌కర్నూల్ స్థానంలో కచ్చితంగా కాంగ్రెస్ అభ్యర్థి గెలుస్తాడని జోస్యం చెప్పారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలుపుతో కేంద్రంలో మన ప్రభుత్వం అధికారంలోకి వస్తే మన ప్రాంతమే అభివృద్ధి చెందుతుందన్నారు. గత ప్రభుత్వంలో ఎన్నో హామీలను ఇచ్చి నెరవేర్చని వారు, కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుంటే ఓర్వలేకపోతున్నారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో కట్టిన ప్రాజెక్టులు 40 ఏళ్లు దాటినా చెక్కు చెదరలేదని, తెలంగాణ సాధించాక కట్టిన మేడిగడ్డ బ్యారేజీ అప్పుడే కుంగిపోయిందని దుయ్యబట్టారు. సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు వంశీచంద్‌రెడ్డి మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో కల్వకుర్తి నుంచి కాంగ్రెస్ పార్టీకి అత్యధిక మెజార్టీ అందించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ పార్టీ అభ్యర్థిగా అధిష్టానం ఎవరిని ప్రకటించినా వారి గెలుపునకు సంపూర్ణంగా పనిచేయాలని కోరారు. సన్నాహక సమావేశానికి ముందు బూత్, మండల, బ్లాక్‌ల వారీగా కార్యకర్తలు, నాయకులు మాట్లాడారు. సమావేశంలో ఢిల్లీలో ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి మల్లురవి, గద్వాల జెడ్పీ చైర్‌పర్సన్ సరిత, ఎమ్మెల్యేలు రాజేష్‌రెడ్డి, వంశీకృష్ణ, జెడ్పీ వైస్ చైర్మన్ బాలాజీసింగ్, మాజీ ఎంపీ మందా జగన్నాథం, ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్, చిన్నారెడ్డి పాల్గొన్నారు.

ప్రజారోగ్యం మెరుగుకు కృషి చేయాలి



నర్సింగ్ ఆఫీసర్లకు నియామక పత్రాలు అందజేస్తున్న డాక్టర్ రమేష్‌చంద్ర

నాగర్‌కర్నూల్ క్రైం: ప్రజారోగ్యం మెరుగుపడేందుకు ఆరోగ్య సేవలతో నర్సింగ్ ఆఫీసర్లు కృషి చేయాలని డీసీహెచ్‌ఎస్ రమేష్‌చంద్ర అన్నారు. నర్సింగ్ ఆఫీసర్ల (స్టాఫ్‌నర్సులు) నియామకంలో భాగంగా జిల్లాకు 66 మందిని కేటాయించగా శుక్రవారం 64 మంది విధుల్లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో తెలంగాణ వైద్య విధాన పరిషత్ పరిధిలోని అచ్చంపేట ఏరియా ఆస్పత్రికి 26 మంది, కొల్లాపూర్ ఏరియా ఆస్పత్రికి 26, అమ్రాబాద్ ప్రభుత్వ సివిల్ ఆస్పకి 14 మందిని కేటాయించామని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్యశాఖను బలోపేతం చేయాలనే దృక్పథంతో పనిచేస్తుందని, ప్రజారోగ్యం మెరుగుకు ప్రత్యేకంగా కృషిచేస్తుందన్నారు. గతంలో కాంట్రాక్ట్ విధానంలో పనిచేసిన స్టాఫ్‌నర్సులు ప్రస్తుతం రెగ్యులర్ నర్సింగ్ ఆఫీసర్లుగా ప్రభుత్వ ఉద్యోగులుగా నియామకం చేసిందన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో మెరుగైన ఆరోగ్య సేవలు అందించేందుకు కృషిచేయాలని కోరారు. కార్యక్రమంలో కార్యాలయ సూపరింటెండెంట్ పద్మ, సీనియర్ అసిస్టెంట్లు కామేశ్వరి, అరుణదేవి, శ్రీదేవి పాల్గొన్నారు.

విద్యార్థుల్లో నైపుణ్యాలు వెలికితీయాలి

కందనూలు: సైన్స్ టాలెంట్ టెస్ట్‌తో విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికితీయాలని డీఈఓ గోవిందరాజులు అన్నారు. జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం జిల్లాస్థాయి సైన్స్ టాలెంట్ టెస్టును స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ సైన్స్ టాలెంట్ టెస్ట్ వల్ల ఉపాధ్యాయులు బోధించిన పాఠ్యాంశాలను పూర్తిగా అవగాహన చేసుకుని.. తమలోని నైపుణ్యం వెలికి తీయడానికి ప్రయోగాలపై దృష్టి సారించేలా ప్రాజెక్టు వివరాలను నమోదు చేయడానికి, సైన్స్ విషయాల పట్ల అభిరుచి కలిగించడానికి ఉపయోగపడుతుందన్నారు. జిల్లా సైన్స్ అధికారి కృష్ణారెడ్డి మాట్లాడుతూ 6 నుంచి 9 తరగతులకు మండల స్థాయిలో నిర్వహించిన టాలెంట్ టెస్టులో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులను జిల్లాస్థాయి పోటీలు నిర్వహించామని చెప్పారు.



సైన్స్ కిట్లను అందజేస్తున్న డీఈఓ గోవిందరాజులు

పకడ్బందీగా ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు

నాగర్‌కర్నూల్: ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ సీతారామారావు అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఏర్పాట్లపై సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ప్రశాంతంగా పరీక్ష రాయడానికి సదుపాయాలు కల్పించాలన్నారు. ఈ నెల 28 నుంచి వచ్చేనెల 19 వరకు, ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు కొనసాగుతాయన్నారు. ఇందులో మొదటి సంవత్సరం 6,837 మంది, రెండో సంవత్సరం విద్యార్థులు 7,034 మందికి గాను.. 32 కేంద్రాలను ఏర్పాటు చేశామని వివరించారు. పరీక్షలను సాఫీగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. నిర్ణీత సమయానికి ప్రశ్నపత్రాలు కేంద్రాలకు చేర్చాలని, పరీక్ష ప్రారంభ సమయానికి గంట ముందే విద్యార్థులు కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. మాస్ కాపీయింగ్‌కు ఆస్కారం లేకుండా సిట్టింగ్, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను నియమించి, కట్టుదిట్టమైన పర్యవేక్షణ జరపాలని సూచించారు. సమావేశంలో ఇంటర్ నోడల్ అధికారి వెంకటరమణ, ప్రభుత్వ పరీక్షల నిర్వహణ అధికారులు, వివిధ కళాశాలల ప్రిన్సిపాళ్లు తదితరులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ సీతారామారావు

నేరగాళ్లతో జరభద్రం



పెంట్లవెల్లిలో సైబర్‌నేరాలపై అవగాహన కల్పిస్తున్న పోలీసులు(ఫైల్)

- అత్యాశకు పోయి సైబర్ నేరాలతో మోసపోతున్న జనం
- అరికట్టేందుకు పోలీసుశాఖ ఆధ్వర్యంలో అవగాహన
- 1930 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచన
- సామాజిక మాధ్యమాల అకౌంట్లలో వ్యక్తిగత వివరాలు షేర్ చేయవద్దని పోలీసుల విన్నపం



నాగర్‌కర్నూల్ క్రైం: జిల్లాలో కొంతమంది అమాయకంగా, మరెందరో అత్యాశకు పోయి సైబర్ నేరగాళ్ల వలలో పడి తమ ఖాతాల్లో నగదును కోల్పోయి ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సైబర్ నేరాలపై ఎంత అవగాహన కల్పించినా.. ప్రజల్లో మార్పు రాకపోవడంతో కొంత ఆందోళన కల్గిస్తుంది. జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో 22 పోలీస్‌స్టేషన్ల పరిధిలో ప్రతి రోజూ ఎక్కడో ఒకచోట అవగాహన కార్యక్రమాలు ఏర్పాటుచేసి సైబర్ నేరాలపై సూచనలు చేస్తున్నా.. ఎంతో మంది మోసపోతున్నారు. గతేడాది 442 సైబర్ నేరాలు పోలీస్‌పోర్టల్ ద్వారా నమోదయ్యాయి. అనవసర కాల్స్‌కు స్పందించడంతో పాటు ఫేస్‌బుక్, ట్విట్టర్, ఇన్‌స్టాగాం వంటి సామాజిక మాధ్యమాల అకౌంట్లలో వ్యక్తిగత వివరాలు షేర్ చేయడంతో సైబర్ నేరగాళ్లు తమ పనిని సులువుగా చేసుకునేందుకు ప్రజలు అవకాశం ఇస్తున్నట్లు అవుతుంది. వ్యక్తిగత వివరాలను సేకరించిన సైబర్‌నేరగాళ్లు నకిలీ ఖాతాలను క్రియేట్ చేసి ఇతరులను మోసం చేస్తున్నారు. సైబర్‌నేరగాళ్ల చేతుల్లో మోసపోయిన వారు ఆలస్యం చేయకుండా వెంటనే 1930కు ఫోన్ ద్వారా ఫిర్యాదు చేయాలని, అలా చేస్తే సైబర్ నేరగాళ్ల ఖాతాలను ఫ్రీజ్ చేసి, పోయిన నగదును రాబట్టేందుకు వీలవుతుందని పోలీసులు వెల్లడిస్తున్నారు.

చదువుకున్న వారే ఎక్కువగా

జిల్లాలో సైబర్‌నేరగాళ్ల చేతుల్లో మోసపోతున్న వారిలో ఎక్కువగా చదువుకున్న వారే ఉంటున్నారు. స్మార్ట్‌ఫోన్లు, ఇంటర్నెట్ సాయంతో ప్రజలు బ్యాంకు ఖాతాలను కొల్లగొడుతున్నారు. బ్యాంకు వివరాలు అప్‌డేట్ చేయాలంటూ లింక్‌లు పంపించి, లేదంటే ఎనీ డెస్క్‌లాంటి యాప్‌లు ఇన్‌స్టాల్ చేయించి మోసం చేస్తున్నారు. నిరక్ష్యరాస్యులు మాత్రం మోసపోతున్న కేసుల్లో ఎక్కువగా బ్యాంకు నుంచి ఫోన్ చేస్తున్నామని, ఏటీఎం బ్లాక్ అయిందని, అలాగే బిజినెస్ ఇన్వెస్ట్‌మెంట్ పేరిట మోసం చేస్తున్నారు.

రెండేళ్లలో నేరాలు ఇలా..

జిల్లాలో సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నా.. మార్పు రావడంలేదని పోలీసులు భావిస్తున్నారు. 2022 సంవత్సరంలో 409 సైబర్ నేరాలు నమోదు కాగా రూ.1,39,98,086 నగదును కొల్లగొట్టగా.. 93 కేసులను నమోదు చేసి 73 కేసులకు సంబంధించి రూ.20,17,975 నగదును ఫ్రీజ్ చేశారు. 2023 సంవత్సరంలో 442 సైబర్ నేరాలు నమోదు కాగా రూ1,76,24,626 నగదును కొల్లగొట్టగా 72 కేసులు నమోదు చేసి, 65 కేసులకు సంబంధించి రూ.26,65,192 నగదును పోలీసులు ఫ్రీజ్ చేయగలిగారు. ఈ ఏడాదిలో ఇప్పటి వరకు 75 ఫిర్యాదుల్లో రూ.16,90,198 నగదును కొల్లగొట్టగా.. 10 కేసులకు సంబంధించి రూ.2,44,976 నగదును ఫ్రీజ్ చేశారు. ముఖ్యంగా సైబర్‌నేరాలు జరిగిన కొద్ది గంటల తర్వాత ఆలస్యంగా బాధితులు పోలీస్‌స్టేషన్లలో, పోలీస్‌పోర్టల్ ద్వారా ఫిర్యాదులు చేస్తుండటంతో అప్పటికే సైబర్‌నేరగాళ్లు నగదును డ్రా చేసుకుంటున్నారు. దీంతో సైబర్ నేరస్తుల ఖాతాలను పోలీసులు ఫ్రీజ్ చేసినప్పటికీ లాభం లేకుండా పోతుంది.

1930 టోల్‌ఫ్రీకి ఫిర్యాదు చేయండి



సైబర్ నేరగాళ్ల భారిన పడిన బాధితులు వెంటనే 1930 టోల్‌ఫ్రీకి ఫోన్ ద్వారా, లేదంటే స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే ఖాతాల్లో నగదును ఫ్రీజ్ చేసేందుకు అవకాశం ఎక్కువగా ఉంటుంది. అపరిచిత వ్యక్తులు ఎవరు ఫోన్ చేసి వ్యక్తిగత వివరాలు అడిగినా.. ఎలాంటి సమాచారం అందించకూడదు. సైబర్ నేరాల నియంత్రణ కోసం పోలీసుశాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని కళాశాలలు, పాఠశాలల్లో, ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

– గైక్వాడ్ వైభవ్ రఘునాథ్, ఎస్పీ, నాగర్‌కర్నూల్

జిల్లాలో ఇటీవల జరిగిన సంఘటనలు

⇨ జనవరి 24న కల్వకుర్తిలో ఓ వ్యక్తికి సైబర్‌నేరగాళ్లు ఫోన్ చేసి ఇంటి వద్దనే ఉంటూ వ్యాపారం చేస్తూ.. డబ్బులు సంపాదించవచ్చని నమ్మించి రూ.1,47,000 చోరీకి పాల్పడ్డారు.

⇨ ఫిబ్రవరి 2న నాగర్‌కర్నూల్‌కు చెందిన ఓ వ్యక్తికి ఫోన్ చేసి బ్యాంక్ నుంచి మాట్లాడుతున్నామని చెప్పి ఓటీపీ అడిగి అతడి అకౌంట్ నుంచి రూ.6,99,000నగదు చోరీ చేశారు.

⇨ ఫిబ్రవరి 4న తిమ్మాజిపేటకు చెందిన వ్యక్తి తక్కువ ధరకే కారు వస్తుందనే ఆన్‌లైన్ ద్వారా అడ్వర్‌టైజ్‌మెంట్‌లో ఇచ్చిన ఫోన్‌కు ఫోన్ చేయడంతో బాధితుడి నుంచి రూ.30,350 నగదును చోరీ చేశారు.

బీజేపీతోనే దేశానికి బంగారు భవిష్యత్

- పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ
- ఉమ్మడి జిల్లాలో కొనసాగుతున్న విజయ సంకల్ప యాత్ర



కల్వకుర్తిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్

జడ్చర్ల/ బాలానగర్/ రాజాపూర్/ మిడ్జిల్/ ఊర్కొండ/ కల్వకుర్తి రూరల్: దేశ బంగారు భవిష్యత్ బీజేపీ ప్రభుత్వంతోనే ముడిపడి ఉందని, ప్రజల భద్రత ప్రధాని మోదీ వల్లనే సాధ్యమని పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ అన్నారు. బీజేపీ చేపట్టిన విజయ సంకల్ప యాత్ర శుక్రవారం బాలానగర్ మీదుగా రాజాపూర్, జడ్చర్ల, మిడ్జిల్, ఊర్కొండ, కల్వకుర్తి మండలాల్లో కొనసాగింది. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన సమావేశాల్లో డీకే అరుణ, మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డి, రాష్ట్ర కోశాధికారి శాంతికుమార్ ప్రజలనుద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపిస్తే ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని చెప్పి గద్దెనెక్కిన తర్వాత మళ్లీ లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపిస్తేనే ఆయా పథకాలు అమలు చేస్తామంటూ ప్రజలను మోసం చేస్తున్నారని దుయ్యబట్టారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లకు ఓట్లేస్తే వాళ్లు ఒరగబెట్టేదేమి లేదన్నారు. ప్రధానిగా రాహుల్‌గాంధీకి ఆయా పార్టీల ఇండియా కూటమిలోనే స్పష్టత లేదని ఎద్దేవా చేశారు. శతాబ్దాలపాటు అయోధ్యలో రామమందిరాన్ని నిర్మించుకోలేని పరిస్థితిలో ప్రధాని మోదీ నేతృత్వంలో ఆ కలను సాకారం చేసుకున్నామన్నారు. పేద, బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం పాటుపడే మోదీని మరోసారి ప్రధాని చేద్దామన్నారు. ఆర్టికల్ 370ను రద్దు చేయడంతోపాటు ముస్లింలకు సంబంధించి తలాక్ చట్టాన్ని సైతం రద్దు చేశారని కొనియాడారు. ఈ సందర్భంగా సీనియర్ పాత్రికేయులు ప్రభాకరశర్మ తదితరులు బీజేపీలో చేరగా.. డీకే అరుణ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అలాగే రంగారెడ్డిగూడ వద్ద రైల్వే అండర్ పాస్ నిర్మాణం చేయాలని, ముదిరెడ్డిపల్లి వద్ద హైవేపై ఫ్లైవర్ నిర్మించాలని యువకులు, రాజాపూర్‌లో జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని విద్యార్థులు వినతిపత్రం అందజేశారు.

అసెంబ్లీలో గళం విప్పుతా..

ఊర్కొండలో రైతులతో నిర్వహించిన ముఖాముఖిలో అదిలాబాద్ జిల్లా బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్ మాట్లాడుతూ రాష్ట్రంలో పాడి రైతుల కష్టాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయని ఈ విషయంపై రానున్న అసెంబ్లీ సమావేశాల్లో గళం విప్పుతానని చెప్పారు. పాడి రైతుల బిల్లులు సకాలంలో చెల్లించాలని, అలాగే రాష్ట్రంలో ప్రధానమంత్రి ఫసల్ యోజన అమలు గురించి కోరుతానని వివరించారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఆరు గ్యారంటీల పేరుతో ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చారని ఆరోపించారు. ఏ ఒక్క హామీ నిలబెట్టుకునే స్థితిలో కాంగ్రెస్ పార్టీ లేదన్నారు. హామీల అమలు చేతకాక కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే చేస్తామని చెప్పడం ఎంత వరకు సమంజసం అన్నారు. తెలంగాణలో పాపాత్ములైన బీఆర్‌ఎస్ పాలన పోయి.. మూర్ఖులైన బీజేపీ పాలన రావడం బాధగా ఉందన్నారు. ఆయా కార్యక్రమాల్లో మాజీ మంత్రి చిత్తరంజన్‌దాస్, సిక్కిందర్‌సింగ్, యాత్ర ప్రచారక్ శ్రీవర్ధన్‌రెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ జిల్లాల అధ్యక్షులు శ్రీనివాస్‌రెడ్డి, ఎల్లేని సుధాకర్‌రావు, సీనియర్ నాయకులు ఆచారి, బంగారు శృతి, పద్మజారెడ్డి, బాలాత్రిపురసుందరిదేవి, ప్రతాప్‌రెడ్డి, బండెల రామచంద్రారెడ్డి, నర్సిరెడ్డి, శేఖర్‌రెడ్డి, బీజేపీ ఓబీసీ జిల్లా అధ్యక్షుడు నిరంజన్‌గౌడ్, నాయకులు ఓర్సు ఆంజనేయులు, శ్యాంసుందర్‌రెడ్డి, రాజేందర్, ఆంజనేయులు, శ్రీను పాల్గొన్నారు.

స్నాతకోత్సవానికి వేళాయె..

- వచ్చే నెల చివరన స్నాతకోత్సవానికి ఏర్పాట్లు
- 55 మంది విద్యార్థులకు గోల్డ్ మెడల్స్ ప్రకటించిన పీయూ
- వచ్చే నెల 16వ తేదీ వరకు కాన్వకేషన్ సర్టిఫికెట్ల కోసం దరఖాస్తుల స్వీకరణ


పీయూ పరిపాలన భవనం

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీ 4వ స్నాతకోత్సవానికి సిద్ధమవుతుంది. అందుకు యూనివర్సిటీ అధికారులు ఏర్పాట్లు ప్రారంభించారు. కంట్రోలర్ ఎగ్జామినేషన్ అధికారులు గోల్డ్‌మెడల్స్ పొందే విద్యార్థుల జాబితా విడుదల చేశారు. లిస్టులో ఉన్న విద్యార్థులకు వచ్చేనెల నిర్వహించే స్నాతకోత్సవంలో గవర్నర్ చేతుల మీదుగా మెడల్స్ ఇవ్వనున్నారు. సాధారణ విద్యార్థులకు నేరుగా యూనివర్సిటీలో, పోస్టు ద్వారా పంపిచనున్నారు. ఈ క్రమంలో కాన్వకేషన్ సర్టిఫికెట్ల కోసం సాధారణ విద్యార్థులు సైతం దరఖాస్తులు చేసుకునేందుకు పీయూ అధికారులు తేదీలను ప్రకటించారు. ఇప్పటికే అధికారులు గవర్నర్‌ను సంప్రదించినట్లు తెలుస్తుంది. గవర్నర్ ఇచ్చే తేదీల ఆధారంగా వచ్చేనెల చివరన, ఏప్రిల్ మొదటి వారంలో నిర్వహిస్తారా అనే అంశంపై స్పష్టత రావాల్సి ఉంది.

55 మందికి గోల్డ్‌మెడల్స్..

పీజీలో మొత్తం 19 పీజీ కోర్సులు ఉన్నాయి. ఇందులో మొత్తం 47 మంది విద్యార్థులకు మెడల్స్‌ను అధికారులు ప్రకటించారు ఫ్యాకల్టీ ఆఫ్ ఆర్ట్స్, సోషల్‌సైన్స్‌లో 14 మంది, ఫ్యాకల్టీ ఆఫ్ సైన్స్‌లో 18 మంది, ప్రొఫెషనల్ ఎంబీఏ, ఎంసీఏలో ముగ్గురు, ప్రొఫెషనల్ ఫార్మా కోర్సుల్లో ఆరుగురు, ఫ్యాకల్టీ ఆఫ్ ఎడ్యుకేషన్‌లో ఆరుగురు విద్యార్థులు ఉన్నారు. యూజీ కోర్సుల్లో బీఏ 2, బీకాం 2, బీఎస్సీ 2, బీబీఏలో 2 మెడల్స్ ఇవ్వనున్నారు. పీహెచ్‌డీలో మొత్తం ఆరుగురు రీసెర్చ్ స్కాలర్స్ పీహెచ్‌డీ పట్టాలు పొందారు. వారికి కూడా స్నాతకోత్సవంలో భాగంగా మెడల్స్ ఇవ్వనున్నారు. ఇందులో మైక్రోబయోలజీ- 2, కెమిస్ట్రీ-3, ఇంగ్లిష్-1 ఇవ్వనున్నారు. మరికొంత మంది రీసెర్చ్ స్కాలర్స్ వారి థీసెస్‌ని సమర్పిస్తే వారికి కాన్వకేషన్ చివరి రోజు వరకు కూడా మెడల్స్ ప్రకటించేందుకు అవకాశం ఉండడంతో ఇప్పటి వరకు వారి జాబితాను అధికారులు ప్రకటించలేదు.

దరఖాస్తుకు 16 చివరి తేదీ

కాన్వకేషన్ సర్టిఫికెట్ల కోసం దరఖాస్తులు చేసుకునే వారి కోసం యూనివర్సిటీ అధికారులు ప్రత్యేక తేదీలను ప్రకటించారు. పీహెచ్‌డీ పూర్తయిన వారు కాన్వకేషన్ సర్టిఫికెట్ల కోసం రూ.2100, రూ.100 అలమినీ ఫీజులను చెల్లించి వచ్చే నెల 5 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. యూజీ, పీజీ, ప్రొఫెషనల్, ఎమ్మెస్సీ, ఇంటిగ్రేటెడ్ కెమిస్ట్రీ వారు రూ.1,500, రూ.100 అలమినీ ఫీజుతో వచ్చే నెల 11 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. అన్ని కోర్సుల వారు రూ.500 ఫైన్‌తో వచ్చే నెల 16 వరకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉంది. దరఖాస్తులను అన్నింటిని ప్రిన్సిపాల్స్ వచ్చే నెల 19లోగా కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్‌లో సమర్పించాల్సి ఉంటుంది.

గవర్నర్ సమయం ఇస్తే తేదీలు..



పీయూ 4వ కాన్వకేషన్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. కాన్వకేషన్ తేదీపై ఇంకా స్పష్టత రాలేదు. గవర్నర్‌కు ఫైల్ పెట్టాం. అక్కడి నుంచి స్పష్టత వచ్చిన వెంటనే తేదీలను ప్రకటిస్తాం. 55 మందికి మెడల్స్ ఇవ్వనున్నాం. కాన్వకేషన్ దరఖాస్తులకు తేదీలను ఇచ్చాం.

– లక్ష్మీకాంత్‌రాథోడ్, వైస్ ఛాన్సలర్, పీయూ

గోల్డ్ మెడల్స్ ప్రకటించాం



యూనివర్సిటీలో పరిధిలో యూజీ, పీజీలో మొత్తం 55 మంది విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించిన వారికి 2022-23 విద్యా సంవత్సరానికి గోల్డ్‌మెడల్స్‌ను ప్రకటించాం. వారికి కాన్వకేషన్‌లో గవర్నర్ చేతుల మీదుగా మెడల్స్ అందిస్తాం. కాన్వకేషన్ సర్టిఫికెట్ల కోసం యూజీ, పీజీలో ఉత్తీర్ణత సాధించిన వారందరూ కూడా దరఖాస్తులు చేసుకునేందుకు ఈనెల 16 చివరి తేదీగా ప్రకటించాం.

– రాజ్‌కుమార్, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్

జములమ్మ దీవించమ్మా


విద్యుద్దీపాల వెలుగులో జములమ్మ అమ్మవారి ఆలయం (ఇన్‌సెట్‌లో..) జములమ్మ అమ్మవారు

- నేడు అమ్మవారి సన్నిధిలో పౌర్ణమి వేడుకలు
- శోభాయమానంగా ఆలయ సముదాయాలు ముస్తాబు
- 50 వేల మంది భక్తులు దర్శించుకునే అవకాశం
- ఏర్పాట్లు పూర్తిచేసిన ఆలయ సిబ్బంది

గద్వాలన్యూటౌన్: నడిగడ్డ ప్రజలు ఇలవేల్పు.. భక్తుల కొంగుబంగారం.. జములమ్మ అమ్మవారి బ్రహ్మోత్సవాలు కనుల పండువగా సాగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా కీలకగట్టమైన పౌర్ణమి వేడుకలు శనివారం కొనసాగనున్నాయి. దాదాపు 50 వేల మంది వేడుకలకు హాజరై అమ్మవారిని దర్శించుకునే అవకాశం ఉందని అధికారుల అంచనా. పౌర్ణమి వేడుకల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

తెల్లవారుజామున 4 గంటలకు..

జములమ్మ అమ్మవారి సన్నిధిలో పౌర్ణమి వేడుకలు వైభవంగా నిర్వహించనున్నారు. తెల్లవారుజామున 4 గంటలకు 108 కలశాలతో అమ్మవారికి అభిషేకం నిర్వహిస్తారు. 5 గంటలకు విశేష పంచామృతాభిషేకం నిర్వహిస్తారు. అనంతరం అమ్మవారి అలంకరణ, భక్తులకు దర్శనమిస్తారు. పౌర్ణమి వేడుకలకు ఉమ్మడి జిల్లా నుంచే కాకండా ఏపీ, కర్ణాటక, మహారాష్ట్ర నుంచి భక్తులు తరలిరానున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు సుమారు 50 వేల మంది అమ్మవారిని దర్శించుకుని, మొక్కులు తీర్చుకోనున్నారు.

చలువ పందిళ్ల ఏర్పాటు

పౌర్ణమి వేడుకల్లో భాగంగా జములమ్మ అమ్మవారి, పరశురామస్వామి ఆలయ సముదాయాలను విద్యుద్దీపాలు, రకరకాల పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. వేడుకలకు వచ్చే భక్తులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా అధికారులు ఏర్పాట్లు చేశారు. జములమ్మ అమ్మవారి, పరశురామస్వామి ఆలయాల వద్ద ప్రస్తుతం ఉన్న క్యూలైన్‌లకు అదనంగా కొత్త క్యూలైన్లు ఏర్పాటు చేశారు. తాగునీటి సౌకర్యాన్ని కల్పించారు. ఎండ వేడిమిని దృష్టిలో ఉంచుకొని చలువ పందిళ్లు వేశారు. మహిళల కోసం చీరలు మార్చుకునే గదులు ఏర్పాటు చేశారు. అవసరమైన వారి కోసం వైద్య సేవలు అందించేందుకు వైద్య బృందాలు ఉండనున్నాయి. ఆలయ సిబ్బందికితోడు దేవాదాయశాఖ ఇతర ఆలయాల 40 మంది సిబ్బంది విధులు నిర్వర్తించనున్నారు.

ఏర్పాట్లు పూర్తి చేశాం..



పౌర్ణమి వేడుకలకు వచ్చే భక్తులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేశాం. తాగునీటి సౌకర్యాన్ని కల్పించాం. వైద్య సేవలు అందుబాటులో ఉంచాం. సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం. క్యూలైన్ల వద్ద తోపులాట జరగకుండా చర్యలు తీసుకుంటాం. భక్తులు దేవాదాయశాఖ సిబ్బందికి సహకరించాలి.

– పురందర్ కుమార్, ఆలయ ఈఓ

సీఐ పర్యవేక్షణలో బందోబస్తు..

వేడుకలను పురస్కరించుకొని పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. సీఐ టాటాబాబు పర్యవేక్షణలో 10 మంది ఎస్‌ఐలు, 62 మంది ఏఎస్‌ఐ, కానిస్టేబుల్స్, హోంగార్డులు బందోబస్తు నిర్వహించనున్నారు. అదేవిధంగా ఆలయ పరిసర ప్రాంతంలో మూడు ఔట్ పోస్టులు ఏర్పాటు చేశారు. చోరీలు జరగకుండా ఆలయ సముదాయం నుంచి మొయిన్‌రోడ్డు వద్ద ఉన్న ఆర్చి వరకు పలు చోట్ల సీసీ కెమారాలు ఏర్పాటు చేశారు.

క్లుప్తంగా

చికిత్స పొందుతూ మహిళ మృతి

వెల్దండ: మండలంలోని పెద్దాపూర్ గేట్ వద్ద గురువారం బైక్ అదుపు తప్పి పడిపోవడంతో బాలస్వామి, జంగమ్మ భార్యభర్తలు తీవ్రంగా గాయాలపాలయ్యారు. చికిత్స నిమిత్తం హైదరాబాద్ తరలించగా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం జంగమ్మ(35) మృతి చెందినట్లు ఎస్‌ఐ రవి తెలిపారు. ఊర్కొండ మండలం మాధారానికి చెందిన భార్యాభర్తలు జంగమ్మ, బాలస్వామి ద్విచక్ర వాహనంపై హైదరాబాద్ నుంచి కొట్రలో బంధువుల వివాహ వేడుకకు వెళ్తున్నారు. మార్గమధ్యలో పెద్దాపూర్ వద్దకు రాగానే మరోబైక్‌ను తప్పించబోయి అదుపు తప్పి వారు కింద పడిపోయారు. తీవ్రగాయాలు కావడంతో చికిత్స నిమిత్తం హైదరాబాద్ తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ జంగమ్మ మృతి చెందినట్లు ఎస్‌ఐ తెలిపారు. బాధితురాలి అన్న కృష్ణయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

నీటికుంటలో పడి బాలుడు మృతి

నాగర్‌కర్నూల్ క్రైం: ప్రమాదవశాత్తు నీటికుంటలో పడి బాలుడు మృతి చెందిన ఘటన మండలంలోని బొందలపల్లిలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. బొందలపల్లికి చెందిన ప్రవీణ్ (12)కు మతిస్థిమితం సరిగా లేదు. బాలుడు ఇంట్లో నుంచి గ్రామ సమీపంలోని నీటికుంట వద్దకు వెళ్లి ప్రమాదవశాత్తు అందులో పడి మృతిచెందాడు. ప్రవీణ్‌ను ఇంట్లో లేకపోవడంతో గమనించిన కుటుంబసభ్యులు నీటికుంట వద్ద వెతకడంతో మృతదేహం లభ్యమైంది. ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ గోవర్దన్ తెలిపారు.

ఇద్దరు నిందితుల రిమాండ్

నాగర్‌కర్నూల్ క్రైం: బాలికపై సామూహిక లైంగికదాడికి పాల్పడిన ఇద్దరు నిందితులను శుక్రవారం రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ శ్రీనివాసులు తెలిపారు. ఈనెల 19న మండలంలోని ఓ బాలిక పొలానికి కట్టెల కోసం వెళ్తుండగా, అదే గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు లైంగికదాడికి పాల్పడ్డారు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి రిమాండ్ తరలించినట్లు పేర్కొన్నారు.

ఆర్టీసీ బస్సులో బంగారం చోరీ

నవాబుపేట: ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న మహిళ బ్యాగులో బంగారం చోరీ అయిన ఘటనపై శుక్రవారం కేసునమోదు చేసినట్లు ఎస్‌ఐ అభిషేక్‌రెడ్డి తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.. జడ్చర్లకు చెందిన చిన్న రాములమ్మ ఈ నెల 21న మండల పరిధిలోని గురుకుంట గ్రామంలో బంధువుల ఇంట్లో శుభాకార్యానికి వచ్చింది. తిరిగి శుక్రవారం నవాబుపేటలో జిల్లా కేంద్రానికి వెళ్లె ఆర్టీసీ బస్సు ఎక్కింది. ఈ క్రమంలో తన హ్యాండ్ బ్యాగులో ఉన్న 2 తులాల బంగారు ఆభరణం కనిపించలేదు. దీంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రేపు సీఓఈ ప్రవేశ పరీక్ష

కల్వకుర్తి టౌన్: రాష్ట్రవ్యాప్తంగా ఉన్న గురుకులాలలో సీఓఈ ఇంటర్ కళాశాలలో ప్రవేశాలకు సెకండ్ లెవల్ స్క్రీనింగ్ పరీక్షలు ఆదివారం నిర్వహిస్తున్నట్లు జిల్లా గురుకులాల అధికారి దానం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కల్వకుర్తిలోని జేపీనగర్, అచ్చంపేటలోని గురుకుల పాఠశాలలో కంప్యూటర్ ఆధారిత పరీక్ష ఉంటుందన్నారు. విద్యార్థులు ఆయా సెంటర్లకు ఉదయం 9 గంటలకే చేరుకోవాలని, పరీక్షా సమయం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఉంటుందని చెప్పారు.

లా, ఇంజినీరింగ్ కళాశాలల ఏర్పాటుకు కృషి

- పీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వినోద్‌కుమార్
- పీయూలో విద్యార్థుల నిరసనకు మద్దతు


మాట్లాడుతున్న వినోద్‌కుమార్

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీలో లా, ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటుకు కృషి చేస్తామని పీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వినోద్‌కుమార్ తెలిపారు. పాలమూరు యూనివర్సిటీలో పీయూ విద్యార్థి సంఘాల నాయకుల నిరాహారదీక్షలో ఆయన పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. విద్యార్థులు చేస్తున్న దీక్షకు మద్దతు ప్రకటిస్తున్నామని, పీయూలో కొత్త కళాశాలల ఏర్పాటుకు ప్రభుత్వ సహకారం ఉంటుందన్నారు. కొత్త కళాశాలల కోసం చేస్తున్న డిమాండ్ సరైందని, స్థానిక ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి యూనివర్సిటీ అభివృద్ధి కోసం కృషి చేస్తున్నారన్నారు. కొత్త కోర్సులను వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఏర్పాటు చేసేలా మంత్రులు, ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఈ దీక్షకు పీయూ పలువురు టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది సైతం సంఘీభావం తెలిపారు. యూనివర్సిటీ బంద్‌ను ఎమ్మెల్యే సూచన మేరకు వాయిదా వేస్తున్నట్లు పీయూ నాయకులు తెలిపారు. కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్‌ఖాద్రీ, లక్ష్మణయాదవ్, కార్తిక్‌మాదిగ, రాము, ఆవేజ్, కమలాకర్, భరత్, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

పీయూ ఏర్పాటు చేసింది కాంగ్రెస్సే..

- జాతీయ హోదాపై ఎందుకు మాట్లాడడం లేదు
- సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు చల్లా వంశీచంద్‌రెడ్డి


మాట్లాడుతున్న చల్లా వంశీచంద్‌రెడ్డి

స్టేషన్ మహబూబ్‌నగర్: పాలమూరు యూనివర్సిటీకి కేంద్రం రూ.100కోట్లు కేటాయించిందని బీజేపీ నాయకులు గొప్పలు చెప్పుకుంటున్నారని, ఆ యూనివర్సిటీని ఏర్పాటు చేసింది కాంగ్రెస్ పార్టీయేనని సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు చల్లా వంశీచంద్‌రెడ్డి తెలిపారు. జిల్లా కేంద్రంలో టీపీసీసీ అధికార ప్రతినిధి హర్షవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం పలువురు రిటైర్డ్ ఉద్యోగులు చల్లా వంశీచంద్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2006లో ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్నప్పుడు రాష్ట్రం మొత్తంలోని యూనివర్సిటీల్లో తిరిగి విద్యార్థులతో మాట్లాడి రిపోర్టు ఇవ్వాలని రాహుల్‌గాంధీ తనకు సూచించినట్లు తెలిపారు. అన్ని యూనివర్సిటీలు, జిల్లాల్లో తిరిగి ప్రతి జిల్లాకు ఒక యూనివర్సిటీ, ఇంటిగ్రేటెడ్ హాస్టళ్ల ఏర్పాటు చేయాలని రాహుల్‌గాంధీకి నివేదిక ఇచ్చానన్నారు. వెంటనే వైఎస్ రాజశేఖరరెడ్డి జిల్లాకు ఒక యూనివర్సిటీతో పాటు అందులో భాగంగా పాలమూరు యూనివర్సిటీని ఏర్పాటు చేశారన్నారు. వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రారంభించిన ప్రాజెక్టుల వల్లే ఈ రోజు ఉమ్మడి జిల్లాలో పొలాలకు నీళ్లు పారుతున్నట్లు తెలిపారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ఒక్క ఎకరానికి కూడా నీళ్లు పారించలేదని విమర్శించారు. 2004–2014 వరకు కాంగ్రెస్ హయాంలో ప్రతి ఏడాది కృష్ణా బేసిన్ నుంచి సగటున 262 టీఎంసీలు నీళ్లు తీసుకుంటే, గత ప్రభుత్వం పదేళ్లలో కేవలం 212 టీఎంసీలు మాత్రమే వాడుకున్నట్లు వివరించారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం జాతీయ హోదా కోసం నరేంద్రమోదీని అడిగే ధైర్యం ఇక్కడి బీజేపీ నాయకులకు లేదన్నారు. పదేళ్లలో తెలంగాణకు ఏమి చేశారని విజయ సంకల్పయాత్రలు చేస్తున్నారని ప్రశ్నించారు. సీఎంగా మన పాలమూరు బిడ్డ రేవంత్‌రెడ్డి ఉన్నారని, ఎంపీగా గెలిపిస్తే ఎమ్మెల్యేలతో కలిసి పార్లమెంట్ నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసుకుందామని అన్నారు. టీపీసీసీ ఉపాధ్యక్షుడు ఒబేదుల్లా కొత్వాల్ మాట్లాడుతూ వచ్చే పార్లమెంట్ ఎన్నికలు ఎంతో కీలకమని, పార్టీకి మద్దతుగా ప్రతి ఒక్కరూ నిలవాలని కోరారు. అధికార ప్రతినిధి హర్షవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ పార్లమెంట్ నియోజకవర్గంలోని సమస్యలపై సంపూర్ణ అవగాహన ఉన్న చల్లా వంశీచంద్‌రెడ్డిని ఎంపీగా గెలిపించుకొని ఈ ప్రాంత అభివృద్ధిలో భాగస్వామ్యులు అవుదామని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్, రాజేందర్‌రెడ్డి, బెనహర్, రిటైర్డ్ ఉద్యోగులు సాయినాథ్, గట్టు వెంకట్‌రెడ్డి, కోట్ల నర్సింహారావు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

పోరాటానికి మారుపేరు ఛత్రపతి శివాజీ

- గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజాసింగ్

కొత్తకోట రూరల్: ధైర్యం, పోరాటానికి మారుపేరు ఛత్రపతి శివాజీ అని గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ అన్నారు. కొత్తకోటలో హిందూవాహిని ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన ఛత్రపతి శివాజీ విగ్రహావిష్కరణకు ఎమ్మెల్యే రాజాసింగ్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ముందుగా శివాజీ ఉత్సవ విగ్రహాన్ని హిందూవాహిని సభ్యులు పట్టణంలోని ప్రధాన వీధుల గుండా ఊరేగింపు చేశారు. రాత్రి 8 గంటలకు ఛత్రపతి శివాజీ విగ్రహావిష్కరణకు రాజాసింగ్ రావడంతో యువత పెద్దఎత్తున కేరింతలు కొట్టారు. గట్టి పోలీసు బందోబస్తు మధ్య రాజాసింగ్ ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాజాసింగ్ మాట్లాడుతూ హిందూ ధర్మాన్ని, సంస్కృతిని కాపాడిన వీరుడు శివాజీ అని కొనియాడారు. తల్లి నుంచి నైతికతను నేర్చుకున్న శివాజీ మొగలులను తరమికొట్టి హిందూ ధర్మాన్ని కాపాడారన్నారు. ఛత్రపతి శివాజీ అంటే రాజకీయ నాయకుడు కాదని.. ఆయన విగ్రహాలు పెట్టేందుకు ఎందుకు అనుమతి కావాలన్నారు. భారతదేశంలో మనమంతా హిందువులుగా కొనసాగుతున్నామంటే శివాజీ త్యాగమే కారణమన్నారు. హిందువుగా పుట్టిన ప్రతిఒక్కరూ శివాజీ చరిత్ర తెలుసుకోవాలని చెప్పారు. రాబోయే రోజుల్లో భారతదేశం హిందూ దేశంగా ఉండాలంటే ప్రతిఒక్కరూ శివాజీ మాదిరిగా ధైర్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అఖిల భారత ధర్మజాగరణ సహ ప్రముఖ్ ఆలే శ్యాంకుమార్‌జీ, హిందూవాహిని తెలంగాణ రాష్ట్ర సంయోజక్ ఉప్పల రాజు, మాజీ ఎమ్మెల్యే రావుల రవీంద్రనాథ్‌రెడ్డి, డాక్టర్ మోహన, మున్సిపల్ చైర్‌పర్సన్ పి.సుఖేశిని, హిందూవాహిని ఉమ్మడి రాష్ట్రాల అధ్యక్షుడు భూమిరెడ్డి రాజవర్ధన్‌రెడ్డి, బీజేపీ నాయకులు అయ్యగారి ప్రభాకర్‌రెడ్డి, రఘురాంజీ, ప్రవీణ్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, దాబ శ్రీనివాస్‌రెడ్డి, రాంమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అడవిలో కారుచిచ్చు


రాంపూర్ పరిసర ప్రాంత అడవిలో అంటుకుంటున్న మంటలు

మన్ననూర్: పులుల రక్షిత అభయారణ్యంలో గురువారం రాత్రి జరిగిన కారుచిచ్చుతో 4 హెక్టార్ల అటవీ పరిసర ప్రాంతం పూర్తిగా కాలిపోయిందని ఎఫ్ఆర్‌ఓ ఈశ్వర్ తెలిపారు. మన్ననూర్ ఫారెస్టు రేంజ్ పరిధిలోని రాంపూర్, భౌరాపూర్, పుల్లాయిపల్లి బేస్ క్యాంపు పరిధిలోని పరిసర ప్రాంతాల్లో ఈ ప్రమాదం జరిగిందన్నారు. దీంతో అటవీ సిబ్బంది తక్షణమే స్పందించి మంటలు ఆర్పివేశామన్నారు.

రామన్‌పాడులో 1,017 అడుగుల నీటి మట్టం

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయంలో నీటి మట్టం తగ్గుతోంది. శుక్రవారం 1,017 అడుగులకు చేరింది. జూరాల ఎడమ కాల్వ, సమాంతర కాల్వ ద్వారా వచ్చె నీటిని నిలిపివేశారు. తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కులు నీటిని వినియోగిస్తున్నామని ఏఈ సింగిరెడ్డి రనీల్ రెడ్డి తెలియజేశారు.

జోగుళాంబ ఆలయంలో ఎస్‌బీఐ సీజీఎం పూజలు


ఎస్‌బీఐ సీజీఎంకు స్వాగతం పలుకుతున్న చైర్మన్, అర్చకస్వామి

జోగుళాంబ శక్తిపీఠం: అలంపూర్ జోగుళాంబ బాల బ్రహ్మేశ్వర స్వామి ఆలయాలను శుక్రవారం ఎస్‌బీఐ చీఫ్ జనరల్ మేనేజర్ నవీన్ చంద్ర ఝు, జీఎం మంజుశర్మ కలిసి దర్శించుకున్నారు. ఆలయ చైర్మన్ చిన్నకృష్ణయ్య నాయుడు, అర్చకుడు ధనుంజయ్ శర్మ ఆలయ మర్యాదలతో వారికి సాదర స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు ఉభయ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు స్థల పురాణాన్ని వివరించి తీర్థ ప్రసాదాలు అందజేసి వేద ఆశీర్వచనం చేశారు.

చండీ హోమాలు, రథోత్సవం..

వారోత్సవాల్లో భాగంగా జోగుళాంబ అమ్మవారి ఆలయంలో శుక్రవారం ఉదయం సామూహిక చండీహోమాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు విక్రాంత్ శర్మ సశాస్త్రియంగా క్రతువును నిర్వహించారు. ప్రదోషకాలంలో జోగుళాంబ అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని రథంలో కూర్చోబెట్టి ఆలయం చుట్టూ ఊరేగించారు.

పాఠశాలకు ఉపాధ్యాయులపై కోతుల దాడి

- ఇద్దరికి తీవ్ర గాయాలు



గాయపడిన ఉపాధ్యాయులు

మన్ననూర్: పాఠశాలకు వెళ్తున్న ఉపాధ్యాయులపై కోతుల గుంపు దాడి చేసిన ఘటన మన్ననూర్-అచ్చంపేట ప్రధాన రహదారిపై శుక్రవారం చోటు చేసుకుంది. అమ్రాబాద్ మండల కేంద్రానికి చెందిన ఇమ్మడి వెంకటేష్, పదర మండల కేంద్రానికి చెందిన బూరం ఆంజనేయులు ప్రభుత్వ ఉపాధ్యాయులు. ఇద్దరు కలిసి ఒకే బైక్‌పై పాఠశాలలకు వెళ్తున్నారు. బొంగులుతార్ ఘాట్ రోడ్ నుంచి బైక్ కిందకు దిగగానే ఒక్కసారిగా కోతులు బైక్‌పై దాడి చేయడంతో ఆందోళనకు గురయ్యారు. దీంతో బైక్ అదుపు తప్పి రోడ్డుపైన కిందపడిపోయింది. తలకు హెల్మెట్ పెట్టుకున్న వెంకటేష్‌కు స్వల్ప గాయాలు కాగా ఆంజనేయులుకు తలకు తీవ్ర గాయమైంది. 108 అంబులెన్స్ సాయంతో క్షతగాత్రులను అచ్చంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఇద్దరి ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉందని వారి స్నేహితుల ద్వారా తెలిసింది. ఇదిలా ఉండగా ప్రధాన రహదారి కావడంతో యాత్రికులు కోతులకు తినుబండారాలు వేస్తుండటంతో మన్ననూర్ అటవీశాఖ చెక్‌పోస్టు మొదలు కొని రంగాపూర్ వరకు కోతులు అధికమయ్యాయి. దీంతో రహదారిలో వెళ్లే వాహనాల వెంట పరుగులు తీయడం, బైక్‌లపై దాడులు చేయడం నిత్యకృత్యంగా మారింది. అధికారులు స్పందించి కోతులను కట్టడి చేయాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.

'పేట' జాగిలానికి ప్రథమ బహుమతి


బంగారు పతకం అందుకుంటున్న కానిస్టేబుల్

నారాయణపేట రూరల్: ఐఐటీ మొయినాబాద్ శిక్షణ కేంద్రంలో 8 నెలల శిక్షణ పూర్తి చేసుకున్న జాగిలాల ప్రదర్శన శుక్రవారం నిర్వహించారు. ఈ ప్రదర్శనలో నారాయణపేటకు చెందిన జాగిలం ప్రథమస్థానంలో నిలిచింది. పాసింగ్ ఔట్ పరేడ్‌లో ఉత్తమ ప్రదర్శన ఇచ్చిన జాగిలంతో పాటు శిక్షకులుగా వ్యవహరించిన కానిస్టేబుళ్లు రవి, నరేందర్‌కు డీజీపీ రవిగుప్తా బంగారు పతకం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చక్కటి శిక్షణ పొంది ఉత్తమ ప్రదర్శన ఇవ్వడం ఆనందంగా ఉందన్నారు. హత్యకేసుల్లో నేరస్తులను పట్టుకోవడం, దొంగతనాలకు సంబంధించి క్లూస్ టీమ్‌కు ఎంతో ఉపయోగపడుతుందన్నారు.

విద్యుత్ కోతలు ఉండొద్దు: ఎస్ఈ


అధికారులతో సమీక్షిస్తున్న ఎస్ఈ

నారాయణపేట: వ్యవసాయంతో పాటు గృహ వినియోగదారులకు వేసవిలో కోతలు లేకుండా నిరంతరాయంగా విద్యుత్ సరఫరా జరిగేలా చూడాలని ఎస్ఈ వి.ప్రభాకర్ సూచించారు. శుక్రవారం సంబంధిత అధికారులు, సిబ్బందితో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు సూచనలు చేశారు. ఎక్కడైనా సమస్యలు తలెత్తితే వెంటనే స్పందించాలని.. వినియోగదారులు సమస్యలపై ఫోన్‌చేస్తే సరైన సమాచారం ఇచ్చి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసి వినియోగదారుల మన్ననలు పొందాలన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో డీఈ సంజీవరెడ్డి, ఏడీఈ నందకిషోర్, వివిధ మండలాల ఏఈలు పాల్గొన్నారు.